# పిరికివాడు

— వై. నరసింగరావు

మూర్తి అసలు పేరు సత్యనారాయణమూర్తి కలెక్టరాఫీసులో అప్పర్ డివిజన్ క్లార్కు. గుంటూరులో బి.కాం. పాసయి విశాఖపట్నంలో ఉద్యోగ రీత్యా స్థిరపడిపోయాడు. గుంటూరులో ఉద్యోగం దొరక్క విశాఖ వచ్చేరా? అని ఎవరైనా అడిగితే నవ్వేసి ఊరుకుంటాడు. కాని హృదయం ఘోరున ఏడుస్తుంది. అతడి స్నేహితుడు కమలాకరం

గుంటూరులో వున్నప్పుడు ప్రక్కయింటిలో ఉన్న వనజ తలపుకిరాని క్షణం తన జీవితంలో లేదు. ఉండదేమో! వనజ తనను మోసం చేసిందా? లేక తనే వనజను మోసం చేశాడా? అన్నది. తెగని ప్రశ్న.

పాత డైరీ ముందేసుకొని పేజీలు త్రిప్పుతూ కూర్చున్నాడు.

సెప్టెంబరు 2 దగ్గర వ్రేళ్ళు పేజీలను త్రిప్పటం మానేసాయి. ఆ రోజునుంచే తనకు ప్రపంచంలో పొందే సుఖాలకు, దుఃఖాలకు నాంది అని మూర్తి అనుకుంటూ ఉంటాడు.

సెప్టెంబరు 2 :

మేడమీది గది కిటికీలో నుండి ప్రక్క డాబా మీదికి చూడగానే అంతవరకూ నన్నే గమనిస్తున్న రెండు కన్నె చూపులు తత్తరబడుతూ క్రిందికి వాలి చటుక్కున మాయమైపోయాయి. నా మనసు తీయని బాధకు గురి అయింది కళ్ళనుబట్టి మిగిలిన అవయవాలను ఊహించుకుంటూన్న సమయంలోనే తెల్లారిపోయింది

సెప్టెంబరు 3 :

"ఏమైనా పుస్తకాలుంటే యివ్వ అక్కయ్యా." అన్న తీయని ప్రశ్న నన్ను ఉక్కిరిబిక్కిరి చేసింది.

"వదినా! కాఫీ!" అంటూ వంటగదిలోనికి జొరబడ్డాను. 'అవే కళ్ళు' మనసు గంతువేసింది

"కాఫీ ఇస్తానుగాని మూర్తీ! వనజకు ఏమైనా పుస్తకాలిచ్చిపంపు. వెళ్ళమ్మా! మా మూర్తి గూడ నీలా పుస్తకాల పురుగే!"

"రండి" అంటూ ఆలస్యం చేయకుండా మేడమెట్లు మూడేసి చొప్పున ఎక్కిపోయాను

వనజ తలుపుదగ్గరే నిల్చుండిపోయింది.

"రండి! అక్కడే నిల్చుండిపోయారేం? చూసుకోండి మీకు కావలసిన పుస్తకాలు" అన్నాను కళ్ళలోనికి సూటిగా చూస్తూ.

వనజ పుస్తకాలను తదేక దృష్టితో చూస్తోంది. నేను వనజను అదే దృష్టితో చూస్తున్నాను.

"'బసదీవి' చదివారా?" అంటూ చటుక్కున తల త్రిప్పింది.

ఇద్దరి కళ్ళు కలిసాయి. వనజ కళ్ళు బరువుగా వాలిపోయాయి.

"ఏం చదివారు మీరు?" ప్రశ్నించాను.

"'మెట్రిక్' ప్రయివేటుగా పాసయ్యాను" తల దించుకునే జవాబు చెప్పింది.

"పుస్తకాలంటే మీకంత ఇష్టమా?"

అవునన్నట్లు తలూపింది.

"ఇదివరకు మీరు ఎక్కడుండేవారు?" ఇంకాసేపు ఆమెను చూడవచ్చునను కొని ప్రశ్నించాను

"అప్సరాహాలు ప్రక్కన. అక్కడ ఎప్పుడూ గొడవగా ఉంటుందని ఇక్కడకు

వచ్చేస్తాం ఇక్కడ చాలా బాగుందండీ"

"మనుష్యులు కూడానా" అల్లరిగా చూసాను.

"అందుకు సందేహమా ?" అంటూ చిరునవ్వునవ్వి పరుగు లంకించుకుంది.

నాకు మతిపోయింది. "బాబా ! ఎంతకైనా ఉన్నారు ఈ కాలం పిల్లలు"

"మూర్తీ, కాఫీ రెడీ" అన్న ఒదిన పిలుపుతో క్రిందికి వెళ్ళిపోయాను.

సెప్టెంబరు 5 :

"ఇదిగోనండి మీ బడదీది'" తీయని తలపులలో తేలిపోతున్న నాకు ఏమీ వినబడలేదు.

"ఏమండోయ్ ! ఏమిటంత దీర్ఘంగా ఆలోచిస్తున్నారు ?" వనజ ప్రశ్నతో ఉలిక్కిపడి -

"మీ కోసమే" చిలిపిగా చూస్తూ అనేసాను.

"నేనంత కొరకరాని కొయ్యగా తయారై పోయానా మీకు ?" కవ్వింపుగా అంది.

నిండుగా ఊపిరి పీల్చుకున్నాను. "కూర్చోండి" కుర్చీ చూపించాను ఎదురుగా.

వనజ ఒక వైపుగా ఒదిగి కూర్చొంది. ఏదో చెప్పాలని తహ తహలాడాను ఏం చెప్పాలో....ఎలా చెప్పాలో....

"వనజగారూ ! నేనంటే మీ అభిప్రాయం ? మీ అభిప్రాయం ఎలా ఉన్నా మీరంటే నాకు ప్రాణం. ఒదినకు గూడ మీరంటే యిష్టం. ఎప్పుడూ మీ గురించే చెప్తూ ఉంటుంది"

గతరాత్రంతా రిహార్సల్ వేసుకున్న ఒక్కమాటా గొంతు పెగిలిరాదేం ?

"నన్ను కూర్చోబెట్టి మీ ఆలోచనలలో మీరుంటే...." చిన్నబుచ్చుకుంది వనజ.

"సారీ, వెరీ సారీ, మీతో ఏదో మాట్లాడాలను కున్నాను. కాని...."

"ఉత్తరం వ్రాసి యివ్వండి" అంటూ లేడిపిల్లలా పారిపోయింది.

సెప్టెంబరు 8

"కాలేజీలో చదివారు ఆడపిల్లలతో కలిసి. మాట్లాడటానికేం ? పోనీ ఉత్తరం వ్రాసి ఇవ్వచ్చుగా !"

వనజ వ్రాసి పుస్తకంలో పెట్టి యిచ్చిన ఉత్తరం చదివిన తరువాత మనస్సెంతో తేలికైంది. నా పిరికితనానికి నాకే సిగ్గని పించింది.

"వనజగారూ ! కాలేజీలో ఆడపిల్లలతో చదివినంత మాత్రాన తెగువ, తెగింపు ప్రతీ వాళ్ళకి అలవడవు మీరు నమ్మినా, నమ్మక పోయినా నగ్న సత్యమిది నన్ను నేను ఎప్పుడూ తక్కువగా అంచనా వేసుకుంటాను. మీతో పరిచయమే పెద్ద అదృష్టంగా భావించుకుంటున్న సమయంలో మీ వద్ద నుండి ఉత్తరం అందుకోవటం నిజంగా భాగ్యమనే చెప్పాలి సంతోషంతో ఉక్కిరి బిక్కిరి అవుతున్న నాకు ఏమి వ్రాయాలో తెలియటంలేదు."

మూర్తి

సెప్టెంబరు 9.

"మీరు మరీ విడ్డూరంగా ఆలోచిస్తున్నారు మీ కాలిగోటికి గూడ తూగని నన్ను అందలమెక్కిస్తున్నారు. మీరు చాలా అమాయకులు సున్నిత హృదయులు మీసన్నిధిలో కాలం మర్చిపోవాలనుంది. ఉత్తరాలు వెంట వెంటనే చింపేస్తున్నారు కదూ ?"

"వనజా ! నా సన్నిధిలో కాలం మర్చిపోవాలనుంది కదూ ? నా కోరికా అదే ! కాని నా గదిలో ఎక్కువసేపు గడపలేము. నీవు యిల్లువదలి బయటి ప్రపంచంలోనికి రావటానికి వీలవుతుందా ? ఎక్కడ కలుసు కొని 'ఫ్రీ'గా మాట్లాడు కోవచ్చును ?.

"నా ప్రశ్నలకు జవాబులకు ఎదురు చూస్తూ" - మూర్తి !

సెప్టెంబరు 11

"మీరు ఈ కాలపు మనిషిగా లేరు. మన—

కలుసుకొనే ఏర్పాటు నేనే చేయాలా! మీ గదిలో మాట్లాడుకోడానికి ఏమిటి అభ్యంతరం? మీ వదినగారు ఏమైనా అనుకుంటారనా! మీరేగా చెప్పారు ఆమెకు నేనంటే ఇష్టమని. పోనీలెండి, మిమ్మల్నెందుకు ఇరకాటంలో పెట్టడం! మీ పిరికితనం నాకు తెలియదు కనుకనా? ఆదివారం అప్సరాహాలు దగ్గర ఎర్రమేడ వద్దకు మధ్యాహ్నం రెండు గంటలకు రండి. వస్తారా లేక తోడురానా?"

నా కెంతో కోపం వచ్చింది. నన్ను మరీ పసివాణ్ణి చేస్తోంది. ఆడపిల్లలంటే స్వతహాగా భయం నాకు. కాని వనజ నాకు మరీ చేరువయింది. ఈ సారి కలుసుకొని మందలించాలి.

ఇలా చదువుతుండగా స్నేహితుడు కమలాకరం వచ్చి, "ఏరా సత్తిగా! ఆఫీసుకు టైం కాలా!" అన్నాడు.

"ఊర్కో! వచ్చేస్తున్నాను." అంటూ డైరీని మూసేసి డ్రెస్ చేసుకోవటం మొదలెట్టాడు సత్యనారాయణ.

తరవాత ఆఫీసుకు వెళ్ళారు వాళ్ళు.

సెప్టెంబరు 13:

ఆదివారం. నీట్‌గా డ్రెస్ చేసుకొని ఎందుకైనా మంచిదని ఒంటిగంటకే అప్సరా హాలు దగ్గర ఎర్రమేడ చేరుకున్నాను. ఐదు నిముషాలయింది. "టాటా!!" అంటూ వనజ ఎర్ర మేడలోంచి వచ్చింది. ఎవరో అమ్మాయి చేయూపుతూ లోనికి వెళ్ళి తలుపేసుకుంది. వనజ నాకు మరీ దగ్గరగా వచ్చి నిల్చుంది. ఏదో భయం నాలో ప్రవేశించింది. నా ధైర్యం నిరూపించుకోవాలనుకొని బయలుదేరి యిలా 'డీలా' పడిపోవటం బాగోలేదని స్టడీగా నిల్చున్నాను.

"అబ్బాయిగారూ! మీరు నాతో కలుసుకోటానికి వస్తున్నట్లు మీ వదినగారికి చెప్పి వచ్చారా?" కొంటెగా నవ్వింది.

"వనజా!" జాలిగా పిల్చాను. ఏమనుకుందో మరేం మాట్లాడలేదు.

"పదండి" ముందుకు దారితీసింది. నేను ఫాలో అయాను రెండు బాల్కనీ టిక్కెట్లు కొని తీసుకువచ్చింది.

"ఏం సినిమా ఔతోందో! ఒక్క పోస్టరూ కనబడదేం!" అడిగాను.

"పాతాళభైరవి" తక్కున సమాధానమిస్తూ—"మరేం భయంలేదు. నేనున్నాగా" అంటూ కిలకిలమని నవ్వింది.

ఆ నవ్వు నాలో గిలిగింతలు పెట్టింది. కాని వనజ నన్ను మరీ ....

"కోపంవచ్చిందా అండీ!" గోముగా అడిగేసరికి నన్ను నేనే మర్చిపోయాను.

టిక్కెట్స్ చింపగానే ఎదురుగా వున్న రెండు సీట్లను చూపుతూ.

"ఇక్కడ కూర్చుందామా?" ఆశగా చూసాను.

నా వైపు కొరకొర చూసి ముందుకు పోసాగింది వనజ.

"నేనేం తప్పు మాట్లాడాను! నేనెంత ప్రేమగా, ఆరాధనగా చూస్తాను ఆమె కళ్ళ వైపు." వనజ కోపంగా చూసింది. ప్రక్కన కూర్చోమన్నానని కోపమా! ఏమిటో వీళ్ళు ఒక పట్టాన అర్థంకారు. ద్వారం దగ్గరగా కూర్చుంటే "శుభం" కనబడగానే పారిపోవచ్చు. జనగణమనకి నిల్చోకుండా. ఈ రోజుల్లో ఫాషనాయె."

వనజ చేయూపుతోంది - 'రమ్మన్నట్లుగ'

నా ఆలోచనలకు స్వస్తిచెప్పి 'ఎవరెస్ట్' ఎక్కినట్లుగ టాప్ సెట్స్ వైపు వెళ్ళాను. అక్కడ ఎవరూ లేరు. అప్పటికే వనజ కూర్చుంది

"ఇక్కడ కూర్చోనా"! ప్రక్క సీటును చూపుతూ అడిగాను.

"కాక నెత్తిన కూర్చుంటావా!" ఆలస్యము చేస్తే మరేం అంటుందోనని చటుక్కున ప్రక్క సీటులో కూర్చున్నాను. పెద్దఘనకార్యం చేసిన వాడిలా ఫోజు పెట్టి.

"మీ వదినతో ఏమని చెప్పి వచ్చారు!"

చెప్పి... రహస్యంగా అడిగింది.

నా సంగతిలా వుంచు. మగవాడివి. ఎలాగైనా రాగలవు నీవెలా రాగలిగావు?"

"ఇదు హాసారే ఎక్కడికి నా స్నేహితురాలు లతా వాళ్ళకి, ఆమె దగ్గరకని చెప్పి వచ్చాను. పట్టుగూడ అలే ఒప్పింది."

"మాటకారివే!" ప్రశంసాపూర్వకంగా అన్నాను.

"మనిదరిని చూసి ఎవరైనా ఏమనుకుంటారు?" నావైపు క్రీగంటచూస్తూ అడిగింది.

"ఏమనుకుంటారేం?" ఎదురు ప్రశ్న వేసి, "అవును. ఏమైనా అనుకుంటారేమో?" వేగా అన్నాను.

"మా అన్నయ్యను మీరు చూసేరా?" అడిగింది.

"లేదు. మీ అన్నయ్యనే కాదు, మీ అమ్మ, నాన్న...."

"అండి! నా కుండేది మా అన్నయ్యే మా అమ్మే" విచారంగా అంది.

"సరి సరి! నా లాగే నన్నమాట" విచారంగానే అన్నాను.

"మా అన్నయ్య నా బరువు ఎంత వేగంగా వదుల్చుకుందామా! అని చూస్తున్నాడు. దారినపోయే దానయ్య - "మీ చెల్లెల్ని నా కిచ్చి వివాహం చెయ్యండి. కాని కట్నం అక్కర్లేదు" అన్నాడనుకోండి. "సరే, అలాగే కానివ్వండి" అంటాడు."

"అంత మంచివాడా? మీ అన్నయ్య" ప్రశ్నించాను.

"నా ఖర్మకొద్దీ దొరికారు" నొసటిమీద కొట్టుకుంది.

"మంచివాడు అనటం కూడ తప్పేనా?" స్వగతంలోనే అనుకున్నాను.

"నరుడా, ఏమి నీ కోరిక?" అంటోంది సినిమాలో దేవత.

"మీరు...." ఏదో అనబోయింది. మధ్యలోనే వారించి -

"నరుడేం కోరుకుంటాడో విందాం" అన్నాను ఆసక్తిగా.

"ఆఁ! డైరెక్టరేమి కోరమంటే అదే కోరుకుంటాడు" కొంచెంసేపు ఆగి "మీరేం కోరుకుంటారు?" కుతూహలంగా అడిగింది.

"నిన్ను" ఛటుక్కున అన్నాను. 'ఫేన్' గాలివీస్తున్నా చెమటపట్టేసింది. "నేనేనా అమాటన్నది? కలకాదుకదా? గుండె మెయిలు స్పీడులో కొట్టుకుంటుంది. లేచి పారిపోదామా?" అనుకున్నాను.

వనజ తల నాగుండెమీద వాలిపోయింది. గుండె ఆగినంత పనయింది. అయిదు నిమిషాలయింది. వనజ అలాగే ఉండిపోయింది.

## బాపూ!

బాపూ!
నీ ఆశలకు
ఆశయాలకు
నీ బంగారు కలలకు
ప్రతీక లేమిటి?
బానిస బొటవి తని నవజాతకులు
చెత్తకుప్ప గుప్పెడంతని దౌర్భాగ్యులు
నిలువ నీడలేని నిర్భాగ్యులు
నీ కలలకు నేటి ప్రతీకలు
దేవుని పాపాలకు
తీరని శాపాలకు
మారని నుదుటి రాతలకు
బలియైన వారి బ్రతుకులు
సంధించిన సంకెళ్ళు తెగి
కరుగుతున్న కన్నీళ్ళు ఆగి
నీలితెరలు తొలిగేదెపుడు?
నీ కలలకు ప్రతీకలెపుడు?

—ఎం. రామచంద్రారెడ్డి

నాలో భయం ఆక్రమించింది.

"ఏమయింది వనజా ! ఏంచేస్తున్నావు" భయంగా ప్రశ్నించాను.

"మీ గుండె ఎంత వేగంగా కొట్టుకొంటోందో వింటున్నాను" యథాలాపంగా అన్నా కంఠంలో ఏదో మార్పును గమనించాను

"అసలు కొట్టుకుంటున్నదా ?" నవ్వుతూ ప్రశ్నించినా మనసంతా బరువుగా, ఆవేదనగా, మధురంగా మారిపోయింది భయం, కంగారు నాలో పటాపంచలైపోయాయి. నేనేం చేస్తున్నానో నాకే తెలియని పరిస్థితి తన్మయత్వంలో వనజను పట్టుకొని బలంగా నా వైపు లాగుకున్నాను. అలా ఎంత సేపు గడిపామో తెలియని పరిస్థితి

"ఏమండీ ! నేనంటే మీ కెందుకింత యిష్టం ? అసలు యిష్టమేనా ? సీరియస్‌గా అడిగింది.

"నీ వడిగినంత సులభంగా లెదు జవాబు నా దగ్గర. కాని వనజా ! నీ వంటే ఎంతో యిష్టం. కారణం నా మనసులోనే పదిలంగా ఉంటుంది" ఆవేశంగా అన్నాను.

"పోనీ మన పెళ్ళెయాకన్నా చెపుతారా !" చెవిలో గుసగుస లాడింది.

"పెళ్ళా !" ఆశ్చర్య పోయాను

"నిన్ను పెళ్ళాడుతానని నే నెప్పుడన్నాను ?"

"పెళ్ళికాక మరేం చేద్దా మనుకున్నారు ! నాతో ఉత్తరాలు, సినిమాలు...." అసహనంగా అరిచినంత ఆవేశంగా అంది.

"సినిమాకు నీవు రమ్మంటే వచ్చాను నీవు వ్రాయమంటేనే ఉత్తరాలు వ్రాసాను" భయంగా అన్నాడు.

వనజ వెక్కి వెక్కి ఏడుస్తోంది. నేను కంగారుగా చుట్టూ చూశాను. దగ్గర్లో ఎవరూ లేరు.

"ఛీ ! ఛీ ! మీ రిలాంటి వారనుకోలేదు. అమాయకులను కున్నాను గుండెలు తీసే బంటనుకోలేదు. నన్నొక ఆట వస్తువుగా ఉపయోగిద్దామను కున్నారా !" కోపం, దుఃఖం మిళితమైన స్వరంతో అనేసి లేచి వెళ్ళిపోయింది

నేను తేరుకొనే సరికి అయిదు నిమిషాలు పట్టింది వనజ చెప్పింది నిజమే ననిపించింది. నా మీద ఎన్నో ఆశలు పెట్టుకొంది. కాని నా పరిస్థితి ? భయంకరంగా కోరలతో నాలుక చాచుకొని నన్నాహ్వానిస్తోంది

"డబ్బంతా మీ తమ్ముని చదువుకే వినియోగిస్తే మన గతేం కాను ? రేపు మన పిల్లల భవిష్యత్తు" ఒదిన మాటలకు అన్నయ్య నవ్వుతూ -

పిచ్చిదానా ! నాకా మాత్రం తెలియదంటావా? ఆ డిగ్రీ కాస్త వాడిచేతనయిందనిపిస్తే ఇరవైవేల కట్నంతో పిల్ల రెడీగా ఉంది. వేలు మనకు, అలివేలు వాడికి" అన్నాడు

నేను గదిలో లేనను కొని జరిగిన అన్నయ్య, వదినల సంభాషణ గుర్తుకువచ్చి తలతిరిగి పోయింది.

నాకు ఇరవై వేల కట్నంతో పిల్ల కావాలని వనజతో ఎట్లా చెప్పేది ?

చిన్నప్పటి నుంచి నన్ను పెంచి, పెద్దవాడిని చేసిన అన్నయ్య ఋణం ఎలా తీర్చుకుంటాను ? నన్నింతవాడిని చేయటంలో అన్నయ్య స్వార్థం తెలియంది కాదు. కాని మరో మార్గంలేదు.

"నేను వనజనే పెళ్ళిచేసుకొని తీర్తాను" అని అన్నయ్యతో చెప్పేస్తాను. దృఢ నిశ్చయంతో సీట్లోంచి లేచాను. భారంగా అడుగులు వేసుకుంటూ హాలుబయటకు వచ్చాను. ఎర్రమేడ కెదురుగా వనజ, లత నిల్చొని తీవ్రంగా చర్చించుకుంటున్నారు. నేనేదో తప్పుచేసినవాడిలా తలదించుకొని అడుగులు వేసాను.

సెప్టెంబరు 14 :

వనజను నేను మనస్ఫూర్తిగా ప్రేమిం

చాను కాని పెళ్ళిచేసుకోలేని పరిస్థితి, పరిస్థితులకు నేను బానిసను. ప్రేమించడం అంటే పెళ్ళిచేసుకోవటమేనా? పెళ్ళి లేకుండా ప్రేమించటం తప్పా? పరస్పరాకర్షణ "ప్రేమతో" మొదలయి "పెళ్ళి"తో అంతమైపోవటం ఎన్నిచూట్టంలేదు. అంతమయ్యే ప్రేమకాదు నాది, వనజపట్ల ఉన్నది. నా జీవితంలో మొట్టమొదటిసారిగ ప్రవేశించిన స్త్రీమూర్తి వనజ. చిట్టచివరివరకు ఆమెకు నా హృదయంలో నున్న స్థానం చెక్కుచెదరదు

అన్నయ్యతో తగువుపెట్టుకొని నేను బాపుకొనేది లేదు అలా అని అన్నయ్య చెప్పిన విధంగా ఇరవైవేలకు తాళికట్టనూ లేను. మనసునిండా వనజను నింపుకొని మరో పిల్లకు అన్యాయం చేయలేను. అవచ్చే అమ్మాయి నా హృదయంలో తన హక్కు కోసం పోరాడకమానదు. నా మనసులో చోటులేదు. వనజ ఇదివరకే ఆక్రమించింది. ఈ సంఘర్షణలో నా హృదయం తునాతునకలవ్వక మానదు.

"భగవాన్! నాలాంటి విషమపరిస్థితి ఎవరికీ కల్పించకు. నాతోనే నీ వేడుక అంతంచెయ్" మనసులోనే రోదించాను.

వనజ మరొకరి స్వంతమైతే చూసి సహించే శక్తి ఉందా? పరస్త్రీగా వనజను ఊహించుకొనేటంత లోనే మనసు ఉడికిపోతోందే; అదే నిజమైతే నేను బ్రతగలనా? సినిమా హాలువద్ద విడిపోవటమే మళ్ళీ వనజ కనిపించనేలేదు నన్ను మోసగాడిలా ఊహించుకొంటున్నదా? 'పిరికివాడు' అని జాలి పడుతుందా?

"భగవంతుడు ప్రత్యక్షమవడు" అని తెలిసి గూడ భక్తులు ప్రార్థనలు జరుపుతారు. కనీసం తమ కోర్కెలు తీర్చమని అలా నేను గూడా వనజనే ప్రేమిస్తాను. పెళ్ళి చేసుకోక పోయినా, జీవితాంతం ఆరాధిస్తాను. నన్నెవరు ఆక్షేపిస్తారో చూస్తాను,

## ఓ మహాత్మా!

—సూరా అప్పారావు

ఓ మహాత్మా, ఓ మహానీయా,
నీవు కలలుగన్న ఈ దేశం
ఎలా తయారయిందో చూస్తున్నావా?
మానవత్వం మాయమై
దానవత్వం దరిచేరింది
నీవు ఆశించిన ఆశయాలకు
సమూలంగా సమాధులు కట్టారు
నీ అహింసా నీ నిరాహారదీక్ష
నీవు నేర్పిన రాజకీయవిద్య
ఎందుకు ఉపయోగిస్తున్నారో చూస్తున్నావా?
రాజకీయపు చదరంగంలోని
పావులులా ప్రజలను ఉపయోగించుకొని
ప్రజాక్షేమం మరచి తమస్థానం
పదిల పరచుకునే నాయకులను
వస్తువులు నిల్వతో డబ్బు అధికమవునని
సరుకులు దాచిన వర్తకులను
నానాటికి పెరిగిపోతున్న ధరలను
శ్రమకు తగిన ప్రతిఫలంలేక
విల విలలాడే శ్రమజీవులను
మంచితనంతో వంచించే
మానవత్వంలేని మనుషులను చూస్తున్నావా?
న్యాయానికి జరిగే అన్యాయాన్ని
తిలకిస్తున్నావా?
ఓ మహాత్మా! ఓ మహనీయా చూస్తున్నావా.

మనస్సెంతో తేలిక పడింది.

•

ఆదివారం !!

"ఒరే ! సత్తిగా ! మళ్ళీ డైరీ పట్టుకుని కూర్చున్నావా !" సుడిగాలిలా ప్రవేశించాడు కమలాకరం.

"సినిమాకెళ్దాం పద" మూడు టిక్కెట్లు తెచ్చాను' మళ్ళీ అన్నాడు కరం.

"మూడెందుకురా ! రామారావుగారు ఊళ్లో లేరు గదా !" అనుమానంగా అడిగాడు సత్యనారాయణ.

"మా ఆవిడ వస్తోంది. మా యింటికి ఎన్నిమార్లు రమ్మన్నా నీవు నిరాకరించావు. కనీసం సినిమా హాలులోనైనా నిన్ను మా సుశీలకు పరిచయం చేద్దామని' గలగల వాగేస్తున్నాడు.

సత్యనారాయణ మొఖం వెల వెల బోయింది.

'సారీరా కరం ! నేనురాలేను మరేం అనుకోవద్దు' అన్నాడు సత్యనారాయణ.

"ఇంతలోనే ఏమొచ్చిందిరా అంతలా డీలాపడిపోయేవు. ఏమయిందని ? సర్దాగా సినిమాకు రమ్మంటున్నాను. మా ఆవిడ వస్తోంది. అంతేగదా !" బాధగా అన్నాడు కమలాకరం.

"మనమిద్దరమయితే పదే." నసిగాడు సత్యనారాయణ.

"స్త్రీ జాతి మీదే కక్షకట్టావేమిట్రా ! మొన్నొకసారి "నీకు పిల్లను చూసాను పదరా !' అని సరదాగా అంటే నిలువెత్తున లేచి నానా మాటలన్నావు. కారణం అడిగితే చెప్పవ్ ! ఎలారా నీతో ?"

"తొందర పడకురా కరం ! చెబుతాను సమయం రానీ ! నన్ను మాత్రం మీవాళ్లకి వదిలెయ్"

చేసేది లేక కమలాకరం చిన్నబోయిన మొఖంతో యిల్లు చేరుకున్నాడు.

"ఏమండీ ! మీ "సత్తిగాడు" గారు వస్తున్నారా సినిమాకి ?" అడిగింది సుశీల.

'లేదు సుశీ ! వాడు మారడు ! నన్నిలా కాల్చుకు తింటున్నాడు' ఆవేదనగా అన్నాడు కమలాకరం,

"మీది మరీ చోద్యం ! అతగాడు రాక పోతేనేం ? మనమెళ్దాం !"

"లేదు సుశీ ! నా మనస్సేం బాగోలేదు. ఇవాళొద్దు ! మరోసారి వెళ్దాం." ఈజీచైర్లో వాలిపోయాడు. కమలాకరం.

"మీ సత్తిగాడిగార్నే కట్టు కోవలసింది మీరు" అక్కసుగా అంది సినిమా కేన్సిల్ అయిందన్న ఉక్రోషంలో.

"వాడే ఆడదయి ఉంటే తప్పకుండా చేసుకొనే వాణ్ణి. మగవాళ్ళలో అంత మన్నిత మనస్కులు చాలా అరుదు.

• • •

సెప్టెంబరు 16

ఈ రోజు ఎలాగైనా వనజతో కలిసి మాట్లాడాలి. లేక ఉత్తరం అయినా యివ్వాలి.

నేను వనజను యింత గాఢంగా ప్రేమించానా ? నా మనస్సెందుకింత ఆందోళనకు గురయింది ? సుఖాన్నున్న ప్రాణాన్ని దుఃఖాన్ని పెట్టుకున్నాననా ? ఛీ ! ఛీ ! నా మనస్సెందుకిలా ఆలోచిస్తోంది ? వనజను ప్రేమించి నందుకు బాధ పడుతున్నానా ? లేదు ! నన్ను వనజ తృణీకరించి నందుకు కాదు బాధ. "నేన్నిన్ను పెళ్ళి చేసుకోను. కాని మనం ప్రేమికుల లానే ఉండిపోదాం" అంటే ఏ కన్నెపిల్ల మాత్రం వొప్పుకొంటుంది ?

సెప్టెంబరు 17 :

'ఏమైనా వెళ్దాం' అనుకొని మేడదిగాను. వనజ వదినతో మాట్లాడుతోంది వనజను చూసి కొన్ని సంవత్సరాలైనట్టుంది.

వనజకూడా నన్ను చూసింది. ఆ చూపులో ప్రపంచంలోనున్న అసహ్యమంతా గూడు కట్టుకొని ఉన్నట్లనిపించింది. వదిన వని హడావిడిలో మమ్మల్ని పట్టించుకున్నట్టు

లేదు. నేను తల దించుకొని వెళ్ళిపోయాను వనజ కళ్ళు నన్ను తరుముతునే ఉన్నాయి

"వనజకు ఏకారణం చేతనైనా కాలో, చెయ్యో విరిగిపోతే ఎవరూ ఆమెను పెళ్ళాడరు! నేను పెళ్ళి మానేసి వనజనే ఆరాధిస్తాను ఆరాధిస్తూ కాలం గడిపేస్తాను ఉద్యోగం చేస్తూ అన్నయ్య ఋణం వాయిదాలమీద తీర్చుకొని ఎప్పటికైనా వనజను దక్కించుకోలేనా? అప్పటివరకు వనజ అవివాహితగా ఉండాలంటే నేననుకున్నట్లు.." ఛీ, ఛీ! నా స్వార్థం కోసం వనజను అవివాహితగా బ్రతకాలని ఆశిస్తున్నావా? ప్రేమించిన హృదయం చేతనైతే త్యాగం చేయాలిగాని అవతలివారి త్యాగాన్ని ఆశించే పరిస్థితి కల్పించకోగూడదు

సెప్టెంబరు 18:

వనజకు ఉత్తరం వ్రాద్దామని కూర్చున్నాను వనజ వద్దనుండి జవాబు రాకపోతే యిదే ఆఖరు ఉత్తరం ఈ డైరీకే గుడ్‌బై

వనజా,

ఇంత నిర్దయగా ఎలా వుండగలుగుతున్నావ్? నీ మనస్సెలా వప్పింది? నీ హృదయమెలా అంగీకరించింది? నిన్ను ప్రేమించానే, నిన్ను నా ఆరాధించానే, నిన్నే నా ఆరాధ్య దేవతగా భావించి తపస్సు చేశానే! నే చేసిన నేరమేమిటి? నా మీద యింత తృణీకారమెందుకు? నా మీద యింత నిరాదరణ ఎందుకు? నామీద నీకెందుకింత అసహ్యం? ఎందుకు? ఎందుకింత కఠిన హృదయమైపోయావు? నిన్ను తలుచుకోకుండా నా జీవితమెలా వుంటుంది? ఎలా జీవించను? నిన్ను చూడకుంటే నా హృదయమెలా వుంటుంది? నీకు తెలియదా .. నీ కోసం ఎంత ఆరాటపడ్డానో, ఆవేదన అనుభవిస్తానో? ఎందుకిలా నిరసిస్తున్నావు? ఎందుకిలా నిరాశలో ముంచేస్తున్నావు? చెప్పు! నా. జీవితం లోనికి చంద్రబింబం వలె వచ్చావు వెన్నెల కురిపించావు అమృతం వర్షించావు ఈ సౌందర్యం, ఈ సౌఖ్యం ఈ స్వర్గం నిరంతరం శాశ్వతమని తలచాను. అచంచలమని విశ్వసించాను ఆ నమ్మకంతోనే అద్భుతానందంలో తేలిపోయాను అతిశయించి కేరింతలు కొట్టాను కాని యిదంతా మిథ్యయని, మూణ్నాళ్ళ ముచ్చటని అనుకోలేకపోయాను ఇంద్రధనుస్సు ఇంతలో అదృశ్యమవుతుందనుకోలేదు. నా రంగుల మేడ విచ్ఛిన్నమై పోతుందనీ, నా జీవన బృందావనం శిథిలమై పోతుందని ఎప్పుడూ ఊహించలేకపోయాను నా జలదారు జాబిలి జాలిలేని జాబిలై పోయింది. విన్నని ప్రయోజనమేమిటి? విధిలిఖితం; నా దుఃఖ వృషం; నా పిరికితనం ఈ నా ఆక్రందన బాధ ఎవరితో చెప్పుకోను? ఎవరితో చెప్పిస్తే నీ హృదయం అర్థమవుతుంది? నీ ఒక్క చల్లని చూపుతో నా హృదయంలో మండే అగ్నిజ్వాలలు మంచులా కరిగిపోతాయి. ఆ చూపే నాకు కరువై పోయింది. నీవు నాకు ప్రేమదాతవు నిన్ను మరిపోవాలంటే నన్ను నేనే మర్చిపోవాలి. నాలో ప్రతి రక్తపుబొట్టు నిన్నే తలుచుకుంటూ తపించిపోతున్నది! నీవు సంతోషంగా, ఆరోగ్యంగా కళకళలాడుతూ నా కళ్ళముందే ఉండాలని భగవంతుని ప్రార్థిస్తూ..

నీ కోసం పరితపించే
అభాగ్యుడు.

మేడమీద గది కిటికీపద్దనే కూర్చున్నాను. వనజ వస్తుందేమోనని, గంట తర్వాత నా కళ్ళు తళుక్కున మెరిసాయి వనజ వస్తోంది. నాలో కంగారు అధికం కాజొచ్చింది. కాళ్ళు వణుకుతుండగానే మెట్లుదిగాను. ఆఖరి మెట్టుమీద నిల్చున్నాను

"కప్పు కాఫీ పొడి కావాలక్కయ్యా! అన్నయ్య ఫ్రెండొచ్చాడు" అంటూ వనజ లోనికి వచ్చింది వదిన వంటగదిలోనికి

వెళ్ళింది కాఫీపొడి కోసం.

"ఇదే మంచి సమయం" అనుకొని వేగంగా మెట్లుదిగి వనజచేతిలో ఉత్తరాన్ని కుక్కి వెంటనే మేడెక్కిపోయాను పది నిమిషాలయింది నాలో అలజడి తగ్గటానికి.

సాయంత్రమయింది. వనజ ఉత్తరం చదువుకొని ఏమనుకుందో ; అసలు చదివిందో, చింపిపారేసిందో ; ఆలోచనలతో తలముక్కలయి పోతుందేమోనని పించింది. "ఏదైనా సినిమాకి వెళ్దాము" అనుకొని బయలుదేరాను. అప్రయత్నంగా నా కాళ్ళు అప్సరా వద్ద ఆగిపోయాయి. ఏదో హిందీ సినిమా అవుతోంది. బాల్కనీ టిక్కెట్ కొని మేడెక్కాను. ద్వారంవద్ద కూర్చున్నాను ఎందుకో వనజా నేను కూర్చున్న సీట్లవైపు చూశాను ఖాళీగా ఉన్నాయి నెమ్మదిగా అక్కడికి వెళ్ళి వనజ కూర్చున్న సీటులో కూర్చున్నాను ఎంతో హాయనిపించింది ఈ సీటులోనే కదా వనజ కూర్చుంది. ఆప్యాయంగా అనుకున్నాను

సినిమా పూర్తిగా చూడలేక సగంలోనే వచ్చేశాను. వనజ యింటివైపు యధాలోపముగా చూసాను. వనజ నావైపే చూస్తూ వస్తోంది

"మీ అన్నయ్యా, వదిన సినిమాకు వెళ్ళారు తాళం చెవులు మీకివ్వమన్నారు" ముభావంగా అంటూ తాళం చెవులగుత్తి, ఉత్తరం నా చేతిలో పెట్టి లోనికి వెళ్ళిపోయింది.

నా గదిలో కూర్చొని ఉత్తరం చదివాను

"నాపై మీకున్న అనురాగం, ఆరాధన నిరర్థకం. మీరు ఉత్తరంలో వ్రాసినంత గాఢంగా నన్ను ప్రేమించలేదు విదేశాలలో జరిగే విధంగా పెళ్ళిలేకుండా ప్రేమించుకుంటూ ఉండటానికి వీల్లేదు. ఆసంగతి మీకు తెలియనిదికాదు. కాని మీది పిరికి గుండె. మీరు విపరీతమైనభయస్థులు. నాకు మీ మీద ఎంత మాత్రము కోపంలేదు. జాలితప్ప మీరంటే గౌరవం. మీ స్థానంలో మరెవరైనా ఉంటే యిప్పటి నా పరిస్థితి ఎలా ఉండేదో ; అధః పాతాళానికి త్రొక్కేసే

# ప్రేమ పాఠం

– ఎన్. జమున

ఎన్నో బాసలాడితివి
మరెన్నో ఊసులు చెప్పితివి
నా కోసమే నీవున్నా వంటివి
నీ భావాల రూపం "నేనే" నంటివి
నా నయనాల కాంతిలో-
కవితలెన్నో కడతా నంటివి
నీ మాటల మాధుర్యంలో -
నను ముంచెత్తి మురిపించితివి
అందమంతా నేనని మైమరపించితివి
అలంకరణ నీవై ఆనంద సీమలలో-
అనురాగ గీతికలు పాడుకుందామంటివి
అందరాని లోకాలను అందుకుందా
మంటివి
మమతల మాలికలమై అల్లుకుపోదా
మంటివి
ఊహాల డోలికలలో ఊగుదామంటివి
మంగళ వాద్యాలు పిలుచుచున్నవంటివి
మరులుపొంగించి నను మరుచుకొంటివి
ప్రేమపాఠా లెన్నో వల్లించితివి
'పెళ్ళి' పేరు విని పరుగులు పెడితివి
వలపు రగిల్చితివి – కాని ....
తలపులే మిగిల్చితివి
అల్లరి చేసితివి
ఆశలు పెంచితివి
అందకుండా అంతర్ధానమైతివి.

వారె, కన్నెపిల్లల్ని ఊరించకుండా సాధ్యమైనంత వేగంగా పెళ్ళిచేసేసుకోండి మీ పెళ్ళి యిక్కడ జరిగే పక్షంలో నేను తప్పక వస్తాను."

మీ శ్రేయోభిలాషి
వనజ.

ఉత్తరాన్ని మూడుసార్లు చదివాను నాకు తెలియకుండానే కళ్ళు తడిసాయి. ఆ రోజే నిర్ణయించుకున్నాను యీ వూరికి గుడ్ బై కొట్టేయాలని.

సెప్టెంబరు 19:

అన్నయ్యా, వదినలతో విశాఖపట్నంలో యింటర్వ్యూ అని చెప్పి బయలుదేరాను వనజ యింటి వైపు చూసాను నన్నే చూస్తోంది. అలాంటి చూపును నేనిది వరకెన్నడూ ఎదుర్కోలేదు. కళ్ళ నిండా నీళ్ళు.

డైరీ మూసివేసి సత్యనారాయణ లేచాడు తరువాత పేజీలన్నీ ఖాళీ.

అప్పటి నుంచి యిప్పటి వరకు అన్నదమ్ముల మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు లేవు నిష్ఠూరంగా అన్నయ్య వ్రాసిన ఉత్తరాలకు జవాబుకూడా వ్రాయలేదు.

• • •

"మీ రెవరినైనా ప్రేమించి మోసగింపబడ్డావా?" కమలాకరం అడిగిన ప్రశ్నకు ఉలిక్కిపడ్డాడు సత్యనారాయణ.

జవాబు లేక పోవటం చూసి - "నే నదే అయివుంటుం దనుకున్నాను. కాని నాకు మాత్రం ప్రేమ, పిచ్చి అంటే నమ్మకం లేదురా

"మేరేజెస్ ఆర్ మేడ్ ఇన్ హెవెన్" అన్నలోకోక్తిని నమ్ముతాను. నా పట్ల అక్షరాలా అలానే జరిగిందికూడ" చెప్పుకు పోతున్నాడు కమలాకరం. మౌనంగా వింటున్నాడు సత్యనారాయణ.

"నేను అన్నవరం దేవస్థానంలో పని చేసేవాడ్ని. ఏకాకిని. హాయిగా ఉండేది. ఆ రోజులు మళ్ళీ రావుకా. యాత్రికుల కిచ్చే ఒక రూము నాకు దేవస్థానం వారు కేటాయించారు

"ఒకరోజు ఏం జరిగిందనుకున్నావు?" మళ్ళీ చెప్పటం మొదలెట్టాడు కమలాకరం.

ఉదయం ఒకాయన వచ్చి "మేము గుంటూరు నుంచి వచ్చాము. ఒక్క రూము గూడ ఖాళీలేదు. దయుంచి మా పెట్టె, బెడ్డింగు మీ రూములో...." నసిగాడు.

"ఫర్వాలేదు. అలాగే కానివ్వండి. నేను ఆఫీసుకి వెళ్ళిపోతున్నాను. మీరు ఫేమిలీతో ఉన్నట్టున్నారు. మీరు నా గదిని పూర్తిగా వినియోగించుకోండి. స్నానం అదీ ముగించుకొనే వెళ్ళండి. తాళంచెవి 'జవాను' కివ్వండి." అని ఆఫీసు కెళ్ళిపోయాను.

నేను మధ్యాహ్నం రూముకి వచ్చి చూసేసరికి తలుపులు తీసేఉంది. లోనికి వెళ్ళి చూద్దును కదా నా మంచంమీద ఒక అందమైన అమ్మాయి పడుకొని ఉంది. ఉదయం వచ్చినవారిలా అమ్మాయి ఉందను కొని కేరియర్ విప్పి భోజనంచేయ నారంభించాను.

గిన్నెల చప్పుడికి మెలకువ వచ్చేసినట్టుంది.

"ఎవరూ?' అంటూ చటుక్కున లేచింది.

నన్ను చూసి "మీరా" అంటూ సిగ్గుపడింది.

"మీరు వచ్చేసారేం?" అడిగాను.

"దైవ దర్శనం అయిపోయింది. అన్నయ్య వదినలు మాత్రం వ్రతం చేయించుకొంటున్నారు. రాత్రంతా నిద్ర లేదు. అందుకే...." సిగ్గుపడుతూ అంది.

"మంచిపని చేసారు' అంటూ భోజనం ముగించాను.

"మీ పేరు?" అడిగాను.

"వనజ" అంది.

"వనజా!?" అంటూ గావుకేక పెట్టి అడి

గాడు సత్యనారాయణ.

"అవును. వనజ నీకు తెలుసా?" అడిగాడు కమలాకరం.

"తెలుసు తెలియకేం! మా యింటి ప్రక్కనే వుండేవారు." తనను తాను సంభాషించుకుంటూ అన్నాడు సత్యనారాయణ.

"భోజనం చేశారా?" అడిగాను.

"లేదండి! ప్రసాదం తీసుకున్నాను. భోజనం రాత్రికే"

"మీ పేరు 'సుశీల' అయితే బాగుండేదండీ." అన్నాను.

"పోనీ మీరలానే పిలవండి" సిగ్గుగా అంది.

"మీరూ వచ్చేసారా?" అంటూ అతడు, అతని భార్య ప్రవేశించారు.

"వ్రతం అదీ అయిపోయినట్టే గదండీ!" అడిగాను

"ఏదో అయిందనిపించేసారు పంతులుగారు" నవ్వేడు.

"పదండి! అలా వెళ్ళి వద్దాం" అంటూ దారి తీసాను.

"మీ చెల్లెలా మీతోకూడా వచ్చినామె?" అడిగాను.

"అవునండి! దానికి పెళ్ళిచేసే ప్రయత్నంలో నున్నాను కాని ఈ రోజుల్లో పిల్ల చక్కదనం, గుణ ప్రధానం కావండీ; డబ్బు కుమ్మరించాలి అదే నాకు చాత కావటంలేదు."

"పోనీ నాకిచ్చి పెళ్ళి చేయండి. కానీ కట్నం అక్కర్లేదు" నవ్వుతూ అన్నాను.

"నిజంగానే అంటున్నారా?" సంభ్రమాశ్చర్యంతో అడిగాడు

"ఇలాంటి విషయాల్లో హాస్యం పనికిరాదండి!" సీరియస్‌గా అన్నాను.

అంతేరా! మర్నాడే నాకు సుశీలగా పేరుమార్చుకున్న వనజతో కొండమీదే వివాహం జరిగిపోయింది. చూసావురా నా జీవితం! నాకేం! యిప్పుడెంతో హాయిగా ఉంది."

"వనజ అన్నగారి పేరు ప్రకాశరావేనా!" ఒక్కొక్క అక్షరం తూచి అడిగేడు సత్యనారాయణ

"కరెక్ట్‌గా గెంతేసేడు కమలాకరం. 'సుశీలనీకు కొత్తకాదు కావున తప్పకుండా తమరు మా యింటికి దయచేసి మే మిచ్చే తేనీటిని సేవించి మమ్ములను ధన్యుల్నిచేయ ప్రార్థన" అప్పజెప్పేసాడు కమలాకరం.

"సరేలేరా! అయిదింటికల్లా మీ యింటికి వస్తాను మీ యిల్లెక్కడో చెప్పరా," తేలికగా నవ్వటానికి ప్రయత్నిస్తూ అడిగాడు సత్యనారాయణ.

"నీ కెందు కంత కష్టం. నేనే వస్తా నీ వద్దకు. ఇద్దరమూ కలిసే మా యింటికెళ్లాం. అప్పుడే నాలుగయింది." అంటూ సంతోషంతో హడావిడిగా పరుగెత్తాడుకమలాకరం.

• • •

"సుశీ! మా సత్తిగాడు ఎవరో తెలుసా." అంటూ లోనికి ప్రవేశించాడు కమలాకరం.

"ఎందుకు తెలియదూ? మీ మగ భార్య" నవ్వింది.

"ఛ! ఛ! ఎప్పుడు ఏం మాట్లాడాలో తెలిసి చావదు. యీ ఆడవాళ్ళకు" విసుక్కొంటూ.

"వాడి పూర్తి పేరు సత్యనారాయణ మూర్తి" చటుక్కున నాలుక కర్చుకున్నాడు పూర్తిపేరు ఉచ్చరించి నందుకు.

"మీ యింటి ప్రక్కనే ఉండేవాడటగా ఈ రోజు మనింటికి వస్తున్నాడు."

మూర్తిపేరు వినగానే సుశీలను విప్పిన్న

భూమి కృంగిపోతున్నట్లని పించింది. వృక్షహతప్పి నిల్చున్న ఫళంగా కూలి పోయింది. కమలాకరం కంగారు పడి పోయేడు

*

కమలాకరం అటువెళ్ళగానే సత్యనారాయణ ఆలోచనలో పడిపోయేడు ఏసట సుశీలగా మారి క్రొత్తజీవితం ప్రారంభించిందా? "కరం" మాట ప్రకారము వారి సంసారము సుఖంగానే గడుస్తుందనుకోవాలి తను వెళ్తే వారి పచ్చని సంసారంలో చిచ్చురేపినట్లవు తుందా? తననుచూసి వనజ అసహ్యించుకుంటుందా? తనింకా అవివాహితునిగా ఉన్నందుకు ఆశ్చర్యపడి ఆవేదనకు గురౌతుందా?

'టీ"ం వెళ్ళటమా, మానటమా, వెళ్తే, తాను విగ్రహం కొల్పోయి సుశీలను ఆరాధనగా చూస్తే అంతవరకూ స్త్రీజాతి మీదే మండిపడే తను అలా ప్రవర్తిస్తే కరం ఏమనుకుంటాడు. అనుమానపడి సుశీలను బాధిస్తే! తెలిసీ తను చూస్తూ మౌనం వహించలేడు. కరం దృష్టిలో తానొక మిత్ర ద్రోహిగా పరిగణింప బడేకన్న నీచమైన పని మరొకటి లేదు పీటన్నిటిని అధిగమించి నిశ్చింతగా ఉండాలనుకుంటే ఒకటే మార్గం ఈ లోకాన్నే వదిలివేయాలి. వనజ ఎప్పటికైనా తన దవుతుందనే భ్రమలో ఉన్నాడంతవరకు. కాని వనజ 'పరస్త్రీ' అన్న భావం తనను నిలువునా దహించి వేస్తోంది

వనజ సుఖంగా ఉండాలంటే తన నీడగూడ ఆమెపై పడగూడదు 'ప్రేమ' త్యాగం కోరుతుందిగాని "బలి" కాదు ఇంతదూరం ఆలోచించక "టీ"క వస్తానని మాట యివ్వటం పొరపాటని పశ్చాత్తాప పడటం నిశ్చయమైనం కరంగాడు రాకముందే తొందర పడాలి

"వనజా! నీ కోసం మరో లోకంలో ఎదురుచూస్తూ ఉంటాను. అక్కడ బంధుత్వాలు, కట్టాలకు తావులేదు. మన కలయికను ఎవరూ అడ్డుపెట్టలేని అతీతమైన లోకమది అక్కడైనా ప్రేమగా చూస్తావు కదూ, మనసులోనే అనుకొని డెరీని కిరోసిన్‌లో బాగా తడిపి అగ్గిపుల్ల వెలిగించాడు. భగ్గుమంది. తన 'జీవితం' అనుకున్న సర్వస్వం బూడిద అయి పోయింది.

ఆ పరిస్థితులలో 'టీ' 20' అమృతంలా రుచించింది.

## "మనిషి"

మనిషిలేని మధ్యతరగతి మనిషి
కుటుంబ సంఖ్య
దాటింది ఆరు అంకెలు మించి
ఐనా బాటలేము అతని బ్రతుకు ఖరీదు
మూసాలి రెండు పచ్చనోట్లు పైన
మండుతోంది మనుషుల్లో ఆకలి
ఆ జఠరాగ్ని ఆర్పుకుందామంటే
ఎలా?
అందకుండా ఆకాశం మీద కూర్చు
న్నాయి
నిత్యావసర వస్తువులు —
అరాజరికపు సింహాసనం నుండి
దిగే దెన్నడో ధరల సుడిగుండం
మధ్యతరగతి మనిషి గుండెల్లో
పన్నీరు చిలికే దెన్నడో మరి!

— వేదుల సీత